# సింగిల్ పేజీ కథలు

## టేకిట్ ఈజీ

'చపట్‌లాల్ అండ్ జపట్‌లాల్' నగల షాపు ప్రొప్రయిటర్ శేఠ్ కేశవ్‌భాయ్ ఉదయం షాపులో కూర్చుని వుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చారు అతని వద్దకు.

'ఫటాఫట్ టీవీ ఛానెల్' అన్న వారి ఐడెంటిటీ కార్డుని చూడగానే ముఖమంతా నవ్వు పులుము కుని వారిని సాదరంగా ఆహ్వానించాడు శేఠ్.

''వారం వారం వచ్చే మా 'టేకిట్ ఈజీ' ప్రోగ్రాంని మీరు చూసే వుంటారు'' అన్నాడు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్.

''అప్పుడప్పుడూ చూస్తూనే వుంటాం. భలే ఇంటరెస్టింగ్‌గా వుంటుంది'' అన్నాడు శేఠ్.

''వచ్చే ఎపిసోడ్‌ని ఓ కొత్త పద్ధతిలో తీయాలనుకుంటున్నాం. అందుకు మీ షాపుని ఎంచుకోవడం జరిగింది'' అన్నాడు పి.ఇ.

''ఔనౌను. ఆ విషయం మీ ఛానెల్ వాళ్లు ముందే ఫోన్ చేసి చెప్పారు మాకు'' అన్నాడు శేఠ్. ''వివరాలు చెప్పండి.''

''ఇది ఏప్రిల్ ఫూల్ స్పెషల్ ఎపిసోడ్. అందుకే ప్రోగ్రాంలో గ్లామరూ, క్వాలిటీ జొప్పిస్తున్నాము. ఓ ప్రముఖ సినీతారను ఇందుకు బుక్ చేయడం జరిగింది...'' వివరంగా చెప్పుకుపోయాడు పి.ఇ.

''ఈరోజు సాయంత్రం ఒక సినీతార మీ షాపుకి వస్తుంది. నగలు బేరం చేస్తుంది. కొంతసేపటికి మోడల్స్ ఏవీ తనకు నచ్చలేదంటూ ఏమీ కొనకుండానే వెళ్లిపోబోతుంది. అదే సమయంలో ఆమెకు చూపించిన నగలలో కొన్ని మిస్ అవుతున్నట్లు గ్రహిస్తారు మీరు. ఆమె మీద అనుమానం కలుగుతుంది. ఆమెను కబుర్లలో పెట్టి, ఆమెకు తెలీకుండా పోలీసుల్ని పిలిపిస్తారు. కాసేపట్లో పోలీసులు జీపులో వస్తారు. మహిళా పోలీసు పంకజాన్ని సోదా చేస్తుంది. ఆమె దుస్తుల్లో పోయిన నగలు దొరుకుతాయి. పోలీసులు పంకజాన్ని జీపులో నగలతోసహా ఎక్కించి పోలీస్ స్టేషన్‌కి బయలుదేరుతారు. మిమ్మల్ని స్టేషన్‌కి వచ్చి కంప్లెయింట్ ఇవ్వమంటారు. అలా జీపు వీధి చివరదాకా వెళ్లి మలుపు తిరగ్గానే ఆగిపోతుంది. వీడియో కవరేజ్ అక్కడితో ఆగిపోతుందన్నమాట. ఆ తరువాత జీపు షాపుదగ్గరికి తిరిగివస్తుంది. మీ నగలు మీకు భద్రంగా అప్పగించబడతాయి...''

నోరు తెరుచుకుని ఆలకిస్తూ వుండిపోయాడు శేఠ్.

''ఆ ప్రోగ్రాంతో మీ షాపు పాపులారిటీ పెరిగిపోతుంది. ఆ తరువాత మీకు సేల్సుతో క్షణం తీరిక కూడా వుండదు'' అన్నాడు పి.ఇ నవ్వుతూ.

''అచ్ఛా క్రియా. బహుత్ అచ్ఛా ప్రోగ్రాం'' అన్నాడు సేఠ్, ఆనందాన్ని లోలోపలే అణచుకోవడానికి ప్రయత్నిస్తూ.

''అంతేకాదు, మా ప్రోగ్రాంకి మీ షాపుని ఉపయోగించుకున్నందుకు మా ఛానెల్ మీకు ఓ



మెమెంటో కూడా బహూకరిస్తుంది'' అన్నాడు పి.ఇ.

పైసా ఖర్చు లేకుండా టీవీ పబ్లిసిటీ లభిస్తున్నందుకు శేఠ్ ఆనందానికి మేర లేకపోయింది.

ఏయే యాంగిల్స్‌లో షూట్ చేయాలో, షాపులోని ఏయే భాగాలను క్యాప్చర్ చేయాలో, తన కొలీగ్‌తో చర్చించాడు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్. షాపు బయట, వీధిలోనూ అనువైన యాంగిల్స్‌నీ, డిస్టెన్స్‌నీ స్టడీ చేశారు ఇద్దరూ.

ఆ తరువాత సాయంత్రం యూనిట్‌తో వస్తామనీ, శేఠ్ సిద్ధంగా వుండమనీ చెప్పి తగు సూచనలిచ్చి వెళ్లిపోయారు.

ఆ సాయంకాలం...

సినీతార పంకజం 'చపట్‌లాల్ అండ్ జపట్‌లాల్' ముందు కారు దిగడంతో షూటింగు ఆరంభమయింది. శేఠ్ కేశవ్‌భాయ్ ఆమెను స్వయంగా రిసీవ్ చేసుకుని కూల్‌డ్రింక్స్ ఆఫర్ చేశాడు. ఆమె చూపించిన మోడల్ నగలన్నీ షోకేసులోంచి తీసి ఆమె ముందు పరిచాడు శేఠ్. అలా అరగంటసేపు సెలెక్షన్స్ సాగాయి. ఉన్నట్లుండి మోడల్స్ ఏవీ తనకు నచ్చలేదంటూ ఏమీ కొనుగోలు చేయకుండానే లేచి వెళ్లిపోబోయిందామె. శేఠ్ వదనంలో నిరుత్సాహం వెల్లివిరియడం, అంతలో అతని అసిస్టెంట్ వచ్చి అతని చెవిలో గుసగుసలాడడం, శేఠ్ ముఖం మ్లానం కావడం, అతను పంకజాన్ని ఆపి ఇంటినుంచి కొత్త డిజైన్స్ తెప్పిస్తానని కూర్చోబెట్టడం, పోలీసులకు చాటుగా ఫోన్ చేయించడం, కాసేపటికి పోలీసులు రావడం, పంకజాన్ని సోదా చేయడం, పోయిన నగలు ఆమె దుస్తుల్లోంచి బయటపడడం, శేఠ్‌ని పోలీస్ స్టేషన్‌కి వచ్చి కంప్లెయింట్ ఇవ్వమని చెప్పి, పోలీసులు పంకజాన్ని జీపులో ఎక్కించుకుని తీసుకుపోవడమూ- అంతా ప్లాన్ ప్రకారమే జరిగిపోయాయి. పోలీస్ జీపుని వీధి మలుపు వరకూ వెంబడించింది కెమేరా.

అయితే- షూటింగ్ పూర్తయిన ఎంతోసేపటికీ నగలు తిరిగి రాకపోయేసరికి కంగారు పట్టుకుంది శేఠ్ కేశవ్‌భాయ్‌కి. అనుకున్న ప్రకారం అటు పోలీస్ జీపూగాని, ఇటు వీడియో 'క్రూ'గాని షాపుకి తిరిగిరాలేదు. శేఠ్ మనుషులు ఆ చుట్టుప్రక్కలంతా వెదికిచూశారు. ఎవరి జాడా లేదు!

వెంటనే 'ఫటాఫట్ టీవీ ఛానెల్'కి ఫోన్ చేశాడు శేఠ్.

తాము ఎవరినీ అతని షాపుకి పంపలేదనీ, ఆ ఎపిసోడ్ గురించి తమకేమీ తెలీదని స్పష్టం చేశారు వాళ్లు. సినీతార ఇంటికి ఫోన్ చేస్తే, ఏదో ఫిల్మ్ షూటింగ్ నిమిత్తం వారం రోజులుగా ఆమె మారిషస్‌లోనే వున్నట్లు తెలిసింది.

తాను దారుణంగా మోసపోయినట్లు గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు శేఠ్‌కి. పోయిన నగల విలువ దాదాపు కోటి రూపాయలు వుంటుంది. నెత్తీ నోరూ బాదుకుంటూ పోలీస్ స్టేషన్‌కి పరుగెత్తాడు.

* * *

-తిరుమలశ్రీ (జంషెడ్‌పూర్)